## మహిళా సంఘాలకు లక్ష కోట్ల రుణాలు



హైదరాబాద్, జూన్ 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాలకు ఐదేండ్లలో లక్ష కోట్ల రుణాలను అందించనున్నట్టు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 3.56 లక్షల సంఘాలకు రూ.20 వేల కోట్ల రుణాలను అందిస్తామని చెప్పారు. శనివారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో 2024-25 ఆర్థిక సంవత్సరం మహిళా సంఘాలకు ఇచ్చే రుణ ప్రణాళికను మంత్రి సీతక్క, ఆ శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, సెర్ప్ సీఈవో అనితా రామచంద్రన్ విడుదల చేశారు. మహిళలకు వడ్డీలేని రుణాలు ప్రభుత్వం ఇస్తుందని సీతక్క తెలిపారు. ఎస్‌హెచ్‌జీ సభ్యులకు రూ. 10 లక్షల వరకు ప్రమాద బీమా, రూ.2 లక్షల వరకు సభ్యులు మరణిస్తే వారి రుణాన్ని చెల్లించే విధంగా బీమాను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫామ్స్ కుట్టుపని మహిళా సంఘాలకు అప్పగించామని, దీని ద్వారా మహిళలకు రూ. 50కోట్లు అదనపు ఆదాయం సమకూరిందని చెప్పారు.

## కొత్తగా పోడు భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు

**మంత్రి కొండా సురేఖ హెచ్చరిక**



హైదరాబాద్, జూన్ 15(నమస్తే తెలంగాణ): వ్యవసాయం పేరిట కొత్తగా పోడు భూములను ఆధీనంలోకి తీసుకుంటే కఠినచర్యలు తీసుకుంటామని అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ హెచ్చరించారు. శనివారం సచివాలయంలో ఆమె పోడు భూములపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ... పోడు రైతుల ప్రయోజనాలు దెబ్బతినకుండా, వారి ఉపాధికి ఇబ్బంది లేకుండా పోడు భూముల రక్షణకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. బీఆర్‌ఎస్ హయాంలో అనర్హులకు పోడు భూముల కేటాయింపు జరిగిన విషయం తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన పోడు భూముల పంపిణీ పై నివేదిక సమర్పించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఛత్తీస్‌గఢ్ నుంచి రాష్ట్రంలోకి వస్తున్న గిరిజనులు అటవీ భూములను ఆక్రమించుకుంటున్న విషయాన్ని అధికారులు మంత్రులకు వివరించారు. దీనికి మంత్రులు స్పందిస్తూ, పక్క రాష్ట్రాల నుంచి గిరిజనులు మన ప్రాంతానికి వస్తే ఇక్కడి ప్రజల ప్రయోజనాలు దెబ్బతింటాయి.. భవిష్యత్‌లో ఇలాంటి వలసలు కొనసాగకుండా కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదించి మార్గదర్శకాలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

**బోనాల పండుగకు రూ.25 కోట్లు**

బోనాల పండుగ ఏర్పాటుకు రూ. 25 కోట్లు కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరినట్టు దేవాదాయ, ధర్మాదాయశాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో ఆషాఢ బోనాల జాతర సన్నాహక సమావేశం జరిగింది. బోనాల పండుగను జూలై 7 నుంచి 29 వరకు నిర్వహించనున్నట్టు మంత్రి తెలిపారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని 3 వేలకు పైగా దేవాలయాలకు బోనాల జాతర నిర్వహణకు రూ. 25 కోట్లు గ్రాంట్ ఇన్ ఎయిడ్ అందించాల్సిందిగా సీఎంను కోరామని చెప్పారు.

## ఫుడ్ సేఫ్టీపై ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలవాలి

**కల్తీకి పాల్పడితే కఠిన చర్యలు తప్పవు: మంత్రి దామోదర రాజనర్సింహ**



హైదరాబాద్, జూన్15 (నమస్తే తెలంగాణ): ఫుడ్‌సేఫ్టీలో ఇతర రాష్ట్రాలకు తెలంగాణను ఆదర్శంగా నిలపాలని అధికారులను రాష్ట్ర వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. రాష్ట్రంలో ఫుడ్ సేఫ్టీపై సచివాలయంలో శనివారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మొబైల్ ఫుడ్ లాబ్స్ ద్వారా 200 ఫుడ్ శాంపిల్స్‌ను టెస్ట్ చేయాలని, ప్రభుత్వ హస్టల్స్, ప్రైవేటు బోర్డింగ్ రెసిడెన్షియల్ స్కూల్స్, బేకరీలు, డెయిరీఫుడ్, రెస్టారెంట్లు, ప్యాకేజ్డ్ ఫుడ్ తయారీదారులు లైసెన్స్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకునేలా చూడాలని తెలిపారు. నాణ్యతా ప్రమాణాలు పాటించని ఫుడ్ వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, నివేదికను ప్రతి శనివారం అందించాలని ఆదేశించారు.

# ఆర్టీసీలో స్కాం


శనివారం తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నేత మన్నె క్రిశాంక్

మొదటిపేజీ తరువాయి...

కుంభకోణాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. శనివారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. స్కాంలతో కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డంగా దొరికిపోతున్నదని మండిపడ్డారు. కాంగ్రెస్ నేతలు తమ సొంత ఆదాయం పెంచుకోవడానికి ప్రభుత్వ ధనాన్ని, అధికారాన్ని అడ్డుపెట్టుకొంటున్నారని విమర్శించారు. ఇసుక, బియ్యం, మద్యం, బూడిద ఇలా ప్రతి దాంట్లోనూ కుంభకోణానికి పాల్పడుతున్నారని ఫైర్ అయ్యారు. రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ తాజాగా మరో కుంభకోణానికి పాల్పడ్డారని, టికెట్ మిషన్ల కొనుగోలు, వాటి నిర్వహణపై టెండర్ సంస్థతో కుమ్మక్కయ్యారని ఆధారాలను బయటపెట్టారు. ఆర్టీసీలో ఒక పెద్ద టెండర్ గోప్యంగా ఉంచి పెద్ద స్కాం చేశారని మండిపడ్డారు. 'ఆర్టీసీలో యూపీఐ పేమెంట్స్ ద్వారా టికెట్ జారీచేయాలని బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆలోచన చేసి, ప్రయోగాత్మకంగా అమలుచేయగా విజయవంతమైంది. దాని కోసం ఆటోమేటిక్ ఫేర్ కలెక్షన్ సిస్టం(ఏఎఫ్‌సీఎస్)లో ఇంటెలిజెంట్ టికెట్ ఇష్యూ మెషీన్ (ఐటీఐఎం)లను ప్రవేశపెట్టేందుకు 2023 ఫిబ్రవరి 1న ఆన్‌లైన్ విధానంలో టెండర్లు పిలిచారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆ ఆన్‌లైన్ టెండర్లను రద్దు చేసింది. ఆ టెండర్లు ఎందుకు రద్దు చేశారు?' అని ప్రశ్నించారు. 2024 జనవరి 11న ఇంటలెక్చువల్ టికెట్ ఇష్యూ మిషన్ (ఐటీఐఎం)కు ఆన్‌లైన్ విధానంలో కాకుండా ఆఫ్‌లైన్ టెండర్లు ఎందుకు పిలిచారని నిలదీశారు. ఫిజికల్‌గా బస్‌భవన్‌లో టెండర్లు వేస్తే ఎన్ని టెండర్లు వచ్చాయి? ఎవరు ఎంత కోట్ చేశారు? అన్న విషయాలు ఎందుకు బయట పెట్టడం లేదని ప్రశ్నించారు. ఆఫ్‌లైన్ టెండర్లకు కూడా నెల రోజుల్లోనే 14 సవరణలు తీసుకురావటంలో మతలబు ఏమిటని నిలదీశారు. చివరికి చలో మొబిలిటీ అనే కంపెనీకి 13,200 ఐటీఐఎం మెషీన్ల కాంట్రాక్ట్ ఎలా ఇచ్చారని ప్రశ్నల వర్షం కురిపించారు. ఒక్కో మెషీన్‌కు జీఎస్టీతో కలిపి రూ.16,829 అవుతుందని చలో మొబిలిటీ సంస్థ టెండర్ దాఖలు చేసిందని, ఈ లెక్కన ఐటీఐఎంలకు కలిపి మొత్తం రూ.22.21 కోట్ల వ్యయం అవుతుందని చెప్పారు. ఈ మొత్తం చెల్లింపునకు ఆర్టీసీ అధికారులు టికెట్ల ప్రాతిపదికన ఐదేండ్ల ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్టు చెప్పారు. ఒక్కో టికెట్‌కు జీఎస్టీతో కలిపి 4.0072 పైసలు చెల్లిస్తున్నట్టు ఆయన చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి రోజు 50 లక్షల టికెట్లు జారీ అయితే ప్రతి టికెట్ కమిషన్ నేరుగా ఆ సంస్థకు వెళ్తుందని, ఇలా దీని ద్వారా ఎన్ని కోట్లు ఆ సంస్థ నుంచి లబ్ధిపొందుతున్నారనే అనుమానాన్ని వ్యక్తం చేశారు. ఆర్టీసీ లెక్కల ప్రకారం ప్రతి రోజు 52 లక్షల టికెట్లు అమ్మితే 365 రోజులు.. ఐదేండ్లు.. అంటే ఐటీఐఎంల నిర్వహణ కోసమే ఆ సంస్థకు కనీసం రూ.43 కోట్లను చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఇలా ఇంత పెద్ద ప్రాజెక్టును ఎందుకు గోప్యంగా ఉంచారని నిలదీశారు. చేసిన సవరణలు కంపెనీకి లాభమా? మంత్రికి లాభమా? చెప్పాలని డిమాండ్ చేశారు. దీనిపై బీఆర్‌ఎస్ తరపున కోర్టుకు వెళ్తామని స్పష్టం చేశారు. వివరాలు, టెండర్లు ఖరారు చేసిన విధానాన్ని ప్రశ్నించి అక్రమ టెండర్లపై పోరాటం చేస్తామని తేల్చిచెప్పారు.

## మొలకెత్తని మక్కజొన్న విత్తనాలు

- కంపెనీ నిర్వాకంతో రూ.25 వేల నష్టం
- వైరల్‌గా మారిన కౌలు రైతు వీడియో
- ప్రభుత్వం ఆదుకోవాలంటున్న బండారి శ్రీను


మక్కజొన్న విత్తనాలు వేసిన భూమి

ఐనవోలు, జూన్ 15: సాగుచేస్తున్న భూమిలో విత్తిన మక్కజొన్న విత్తనాలు మొలకెత్తలేదని ఓ కౌలు రైతు ఆవేదనతో సోషల్ మీడియాలో పెట్టిన వీడియో వైరల్‌గా మారింది. హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం ఒంటిమామిడిపల్లికి చెందిన కౌలు రైతు బండారి శ్రీను.. వెంకటాపురం శివారులో 1.2 ఎకరాల భూమిని సాగుచేస్తున్నాడు. మండల కేంద్రంలోని ఓ ఫర్టిలైజర్ షాప్‌లో రూ.4500 చొప్పున ఓ ప్రైవేట్ కంపెనీకి చెందిన మూడు మక్కజొన్న విత్తన బస్తాలను కొనుగోలు చేశాడు. వాటిని తన పొలంలో విత్తి 13 రోజులు గడిచినా 10 శాతం విత్తనాలు కూడా మొలకెత్తలేదు. కంపెనీ నిర్వాకంతో ఇప్పటి వరకు రూ.25 వేల వరకు పెట్టుబడి నష్టపోయాడు. తన భూమిలోనే కాదు.. ఆ కంపెనీ విత్తనాలు చుట్టు పక్కల రైతు భూముల్లో కూడా మొలకెత్తలేదని, తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ సోషల్ మీడియాలో వీడియో పెట్టాడు. ఈ విషయమై ఏవో అడుప కవిత‌ను వివరణ కోరగా.. ఈ విషయం తన దృష్టి వచ్చిందని, తాను సెలవులో ఉన్నానని, విత్తనాల నమూనాను ల్యాబ్‌లో పరీక్షించి వచ్చిన రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకుంటామని వివరించారు.

# ఓట్లేయలేదని దాడులు చేస్తరా?

- మూడుసార్లు ఓడించినా దామోదర్ బుద్ధి మారలే
- భయభ్రాంతులకు గురిచేస్తే ప్రజలే తిరుగబడతారు
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి హెచ్చరిక


సూర్యాపేటలో కూల్చివేసిన హోటల్ భవనాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట, జూన్ 15 (నమస్తే తెలంగాణ) : అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ కాంగ్రెస్ అధికారంలో ఉన్నదని విర్రవీగుతూ సూర్యాపేటలో కాంగ్రెస్ సీనియర్ నేత దామోదర్‌రెడ్డి రాక్షస పాలనను సాగిస్తున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సూర్యాపేటలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గండూరి ప్రవళిక ప్రకాశ్‌కు చెందిన జాజూ హోటల్ భవనాన్ని అర్ధరాత్రి దొంగల మాదిరిగా కూల్చివేయడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. కూల్చేసిన భవనాన్ని శనివారం ఉదయం ఆయన పరిశీలించి మీడియాతో మాట్లాడారు. సూర్యాపేట జనం వరుసగా మూడుసార్లు ఓడించినా దామోదర్‌రెడ్డి బుద్ధి మారలేదని అన్నారు. పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో సూర్యాపేటను అనూహ్య రీతిలో అభివృద్ధి చేస్తే.. కాంగ్రెస్ పాలనలో ఆరు నెలలుగా మళ్లీ అరాచకాలు కొనసాగుతున్నాయని ఆరోపించారు. తిరగబడే చరిత్ర ఉన్న సూర్యాపేట జనం సహనం కోల్పోక ముందే కాంగ్రెస్ నేతలు తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. కేవలం ఓట్లు వేయలేదని రాజకీయ కక్షతో ఉద్యోగులు, వ్యాపారులు, ఇతర పార్టీల నాయకులు, చివరికి డాక్టర్ల పైనా దాడులకు దిగడం సభ్యసమాజం తలదించుకునేలా ఉన్నదని అన్నారు. రాచరిక పాలనలో కూడా లేని అరాచకం సూర్యాపేటలో కొనసాగుతున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎలాంటి ఆధారాలు లేకుండా భవనాలను కూల్చడం దుర్మార్గమని ఖండించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, వైస్ చైర్మన్ పుట్ట కిశోర్, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై వెంకటేశ్వర్లు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, సీనియర్ నాయకులు గండూరి ప్రకాశ్, జడ్పీటీసీ జీడి భిక్షం తదితరులు ఉన్నారు.

## కార్మికుల రక్షణ కోసం పోరాటం

**మాజీ ఎంపీ బోయినపల్లి**



హైదరాబాద్, జూన్ 15 (నమస్తే తెలంగాణ): కార్మికుల హక్కుల రక్షణ కోసం అవసరమైతే పోరాటం చేద్దామని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ పేర్కొన్నారు. రాష్ట్రంలో కార్మికులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై బీఆర్‌ఎస్ కార్మిక విభాగం నాయకులు రాంబాబు, రూప్‌సింగ్, నారాయణ, మారయ్యతో ఆయన సమావేశం అయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖలో ఆశ వర్కర్లు, 104 సిబ్బంది, కాంట్రాక్ట్ ఎంప్లాయీస్, స్త్రీ, శిశు సంక్షేమశాఖ, అంగన్‌వాడీ, వీవోఏ తదితర రంగాల్లో పనిచేస్తున్న కార్మిక, సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ఆయా ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కింది స్థాయి సిబ్బందికి నెలవారీ వేతనాలు సహా ఇతర సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూడాలని కార్మిక నాయకులకు సూచించారు.

## అత్యవసర పరిస్థితులకు సిద్ధంగా ఉండాలి

**కమాండ్ కంట్రోల్ సిబ్బందికి సీఎం రేవంత్ ఆదేశం**



హైదరాబాద్, జూన్ 15 (నమస్తే తెలంగాణ): వర్షాకాలంలో ఎలాంటి అత్యవసర పరిస్థితులు తలెత్తినా వెంటనే స్పందించేందుకు అన్నివిధాలుగా సిద్ధంగా ఉండాలని కమాండ్ కంట్రోల్ సెంటర్ సిబ్బందిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, సీఎస్ శాంతికుమారి, డీజీపీ రవి గుప్తాతో కలిసి కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం సందర్శించారు. వర్షాకాలం ప్రారంభం నేపథ్యంలో చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ఔటర్ రింగ్ రోడ్డు యూనిట్‌గా తీసుకుని డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌ను ఇంటిగ్రేట్ చేయాలని, ఔటర్ లోపలున్న సీసీ కెమెరాలన్నింటినీ వీలైనంత త్వరగా కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానించాలని ఆదేశించారు.

## ఎరువులు స్టాక్ పెట్టండి

**అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం**



హైదరాబాద్, జూన్ 15 (నమస్తే తెలంగాణ): ఈ వానకాలం సీజన్‌కు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచాలని, రైతులకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సాగు, ఎరువులు, విత్తనాల లభ్యతపై శనివారం సచివాలయంలో అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. రాష్ట్రానికి అవసరమైన ఎరువులను కేంద్రం నుంచి ముందస్తుగా తెప్పించాలని సూచించారు. ఇప్పటికే క్షేత్రస్థాయిలో 7.97 టన్నుల యూరియా, 75,278 టన్నుల డీఏపీ, 4.27 టన్నుల కాంప్లెక్స్ ఎరువులను అందుబాటులో ఉంచామని వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి మంత్రికి వివరించారు. ఇప్పటికే రూ.61.15 కోట్లు విలువైన 1,09,937 క్వింటాళ్ల విత్తనా లు రైతులకు అందజేశామని, రైతులు 62 లక్షల పత్తి విత్తన ప్యాకెట్లు కొనుగోలు చేశారని తెలిపారు. లక్ష్యాల మేర ఫలితాలు చూపని ఆయిల్‌పామ్ కంపెనీలకు నోటీసులు ఇచ్చామని చెప్పారు


జూబ్లీహిల్స్ లోటస్‌పాండ్‌లోని వైఎస్ జగన్ ఇంటి ముందు కూల్చిన ఆక్రమణలు

## వైఎస్ జగన్ ఇంటి వద్ద ఆక్రమణలు కూల్చివేత

బంజారాహిల్స్, జూన్ 15: హైదరాబాద్ బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12లోని లోటస్‌పాండ్ వద్ద ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నివాసం బయట ఫుట్‌పాత్‌పై నిర్మించిన సెక్యూరిటీ గార్డుల గదులను జీహెచ్‌ఎంసీ సిబ్బంది శనివారం కూల్చివేశారు. లోటస్‌పాండ్‌లోని జగన్ నివాసం వద్ద బందోబస్తు విధులు నిర్వహిస్తున్న పోలీసులు, భద్రతా సిబ్బంది కోసం ఇంటిబయట గతంలో తాత్కాలిక గదులు నిర్మించారు. ఇటీవల ఎన్నికల్లో జగన్ ఓటమి పాలవడంతో ఇక్కడ భద్రతను తొలగించారు. జగన్ ఇంటిముందు ఫుట్‌పాత్‌ను ఆక్రమించి నిర్మాణాలున్నాయని స్థానికులు ఫిర్యాదులు చేశారంటూ జీహెచ్‌ఎంసీ విజిలెన్స్ విభాగం, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ సంపత్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం ఈ కూల్చివేతలు చేపట్టారు.

## 20 నుంచి జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాలు

హైదరాబాద్, జూన్ 15 (నమస్తే తెలంగాణ): జాతీయ నులిపురుగుల నివారణ వారోత్సవాలను ఈ నెల 20 నుంచి 27 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్నారు. రాష్ట్ర కుటుంబ, వైద్యారోగ్యశాఖ, విద్యాశాఖల సమన్వయంతో ఈ వారోత్సవాలు కొనసాగనున్నట్టు ప్రభుత్వం తెలిపింది. 1 నుంచి 19 ఏండ్ల వయస్సుగల 96,05,790 మంది పిల్లలకు అల్బెండజోల్ టాబ్లెట్లను పంపిణీ చేయనున్నట్టు పేర్కొన్నది.


కలెక్టర్ వల్లూరు క్రాంతిపై చర్యలు తీసుకోవాలని సీఎస్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

## కలెక్టర్ క్రాంతి అక్రమాలపై ఫిర్యాదు

**సీఎస్ కార్యాలయంలో గద్వాల కాంగ్రెస్ నేతల ఫిర్యాదు**

గద్వాల, జూన్ 15 : గతంలో జోగుళాంబ గద్వాల కలెక్టర్‌గా పనిచేసి.. ప్రస్తుతం సంగారెడ్డి కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న వల్లూరు క్రాంతి అవినీతి, అక్రమాలపై విచారణ చేపట్టాలని కాంగ్రెస్ నేతలు సీఎస్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో అప్పటి ప్రజాప్రతినిధులకు సహకరిస్తూ.. తన తండ్రి ద్వారా ఆర్థిక లావాదేవీలు నిర్వహించి అధికార దుర్వినియోగం, అక్రమాలకు పాల్పడిన వల్లూరు క్రాంతిపై చర్యలు తీసుకోవాలని సీఎస్ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ కౌన్సిలర్లు షేక్ శావలి, శంకర్, నేతలు ఇసాక్, గౌస్, రాజేంద్ర, ఆర్డీఎస్ మాజీ చైర్మన్ తనగల సీతారామిరెడ్డి తదితరులు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఆయా మండలాల్లో పేద రైతుల భూ రికార్డులు సరిగ్గా ఉన్నా లేవని, లేని వాటిని సరిచేసేందుకు తన తండ్రి ద్వారా ఆర్థిక లావాదేవీలు నడిపి రికార్డులు మార్చి పాస్‌పుస్తకాలు ఇచ్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు. డబ్బులు ఇవ్వలేని రైతుల వినతులను పెండింగ్‌లో ఉంచిందని ఆరోపించారు. అలాగే నిషేధిత జాబితాలలో నుంచి వందల ఎకరాల భూమిని తొలగించి పెద్ద ఎత్తున ఆర్థిక లావాదేవీలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

# ఇది ఇందిరమ్మ రాజ్యమా?

మొదటిపేజీ తరువాయి...



పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరి భూమి వారిదే అని పాదయాత్రలో చెప్పిన గొప్పలు ఇప్పుడు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఇది ఇందిరమ్మ ప్రభుత్వమే అయితే పది రోజుల్లో సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బాధితుల పక్షాన కబ్జా స్థలంలోనే ఆమరణ దీక్షకు దిగుతానని హెచ్చరించారు. ఈ మేరకు శనివారం ఆయన గాంధీ భవన్‌లో మాట్లాడుతూ.. 1981లో అప్పటి ఇందిరాగాంధీ ప్రభుత్వం కీసరలో పది మంది పేద మాదిగలకు 94 ఎకరాల భూమి ఇచ్చిందని తెలిపారు. అక్కడ ఓఆర్‌ఆర్ రావటంతో పెద్దల కన్ను ఆ భూమిపై పడిందని వెల్లడించారు. ఇందులో భాగంగానే 2003 వరకు పహానీలో వాళ్ల పేర్లు ఉండగా ఆ తర్వాత రాగి కృష్ణారెడ్డి అనే వ్యక్తి ఈ భూములను ఫోర్జరీ సంతకాలు చేయించి వారి కుటుంబసభ్యుల పేర్లపై రిజిస్ట్రేషన్ చేయించినట్టు ఆరోపించారు. దీంతో అసలు భూ యజమానుల వారసులు 120 మంది రోడ్లపై తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కబ్జా స్థలంలో విల్లాలు నిర్మిస్తున్నారని, ఒక్కో విల్లా రూ.3 కోట్లకు విక్రయిస్తున్నారని వివరించారు. ఈ భూమిపై రూ.500 కోట్ల భారీ స్కాం జరుగుతున్నదని ఆరోపించారు. హైకోర్టులో కేసు ఉండగా ఈ స్థలంలో విల్లాల నిర్మాణానికి హెచ్‌ఎండీఏ ఎలా అనుమతి ఇచ్చిందని ప్రశ్నించారు. ఇప్పుడు 30 ఎకరాలకు అనుమతి ఇచ్చారని, విల్లా నిర్మాణం కొనసాగుతున్నదని తెలిపారు. వెంటనే ఈ పనులను ఆపేయించాలని డిమాండ్ చేశారు. హెచ్‌ఎండీఏ ఆఫీస్‌కు తాను, కోదండరెడ్డి వెళితే అధికారులు తమకు సమయం ఇవ్వలేదని, ఇదేనా ప్రభుత్వ పని తీరు అని ప్రశ్నించారు. కమిషనర్ ఇవ్వాల్సిన పర్మిషన్ సెక్రటరీ ఎందుకు ఇచ్చారని ప్రశ్నించారు. దీనిపై రెవెన్యూ కార్యదర్శి నవీన్‌మిట్టల్‌కు ఫిర్యాదు చేస్తే పట్టించుకోవటం లేదని, దానకిశోర్‌ను అడిగితే చూస్తున్నాం సర్ అని అంటున్నారని అన్నారు. కాంగ్రెస్‌ను నమ్మి ప్రజలు ఓట్లు వేశారని, వాళ్ల నమ్మకాన్ని వమ్ము చేయొద్దని ప్రభుత్వానికి సూచించారు. వారం, పది రోజుల్లో ఈ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## హజ్‌యాత్రలో తెలంగాణవాసి మృతి

హైదరాబాద్, జూన్ 15 (నమస్తే తెలంగాణ): హజ్ యాత్రలో బస్సుల్లో రద్దీ కారణంగా హజ్‌లో తెలంగాణ యాత్రికుడు ప్రాణాలను కోల్పోయాడు. మినా నుంచి ఆరాఫత్‌కు రవాణా సౌకర్యం లేక యాత్రికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రెండు రోజులుగా మినాలోని టెంట్ల కిందనే నిరీక్షిస్తున్నారు. వెంటనే తెలంగాణ హజ్ యాత్రికులను ఆదుకోవాలని, మినా నుంచి ఆరాఫత్‌కు తరలించేందుకు చర్యలు చేపట్టాలని రాష్ట్ర హజ్ కమిటీ కేంద్రాన్ని కోరింది. ఈ విషయమై కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖకు రాష్ట్ర హజ్ కమిటీ ఈవో షేక్ లియాఖత్ హుస్సేన్ శనివారం లేఖ రాశారు. మినా నుంచి ఆరాఫత్‌కు బస్సు సౌకర్యం లేక రెండు రోజులుగా దాదాపు 2000 మందికిపైగా తెలంగాణ యాత్రికులు అక్కడే టెంట్ల కిందనే నిరీక్షిస్తున్నారని ఈవో వెల్లడించారు. బస్సులో రద్దీ కారణంగా తెలంగాణ యాత్రికుడు మహమ్మద్ తాజుద్దీన్ మృతి చెందారని తెలిపారు. తెలంగాణ యాత్రికులకు మినాలో టెంట్ కింద కనీసవసతులు లేవని, రెండు రోజులుగా ఆకలిదప్పులతో అలమటిస్తున్నారని తెలిపారు. సౌదీ అరేబియా ప్రభుత్వంతో సంప్రదించి సమస్యను పరిష్కరించాలని, తెలంగాణ యాత్రికులను క్షేమంగా ఆరాఫత్ చేర్చాలని హజ్ కమిటీ ఈవో ఆ లేఖలో కేంద్రాన్ని కోరారు.

## డిజిటల్ ఇండియా బిల్లుకు కేంద్రం కసరత్తు

న్యూఢిల్లీ, జూన్ 15: డీప్ ఫేక్ వీడియోల దుష్పరిణామాలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో కఠిన చర్యలు తీసుకునే దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తున్నది. ఈ మేరకు డిజిటల్ ఇండియా బిల్లు రూపకల్పనపై కసరత్తు చేస్తున్నట్టు తెలుస్తున్నది. రానున్న పార్లమెంటు సమావేశాల్లోనే ఈ బిల్లును ప్రవేశపెట్టే అవకాశం ఉంది. అయితే, ముందుగా ఈ బిల్లుపై అన్ని పార్టీల నుంచి ఏకాభిప్రాయం పొందేందుకు ప్రయత్నించాలని కేంద్రం భావిస్తున్నదని సమాచారం.



## దాహం.. దాహం

నారాయణపేట జిల్లా మక్తల్ మండలం కర్ని గ్రామ సమీపంలో జేసీబీ పనులు చేస్తుండగా.. సుమారు 72 గ్రామాలకు తాగునీటిని సరఫరా చేసే సత్యసాయి పైపులైన్ పగిలిపోయింది. దీంతో నాలుగురోజులుగా నీటి కోసం మండల ప్రజలు తండ్లాడుతున్నారు. కర్ని గ్రామంలో కొత్తగా నిర్మిస్తున్న ఓ ఇంటి వద్ద ఉన్న బోరు నీటిని తెచ్చుకుంటున్నారు. పైపులకు మరమ్మతులు చేయడంలో మిషన్ భగీరథ అధికారుల నిర్లక్ష్యం వల్లే నీటి కష్టాలు తప్పడం లేదని వాపోయారు. -మక్తల్

## సాగుచేస్తేనే రైతుబంధు

**ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వెల్లడి**



జగిత్యాల, జూన్ 15: రాష్ట్రంలో సాగు చేసే రైతులకే రైతుబంధు పెట్టుబడి సాయం అందించాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ టీ జీవన్‌రెడ్డి ప్రభుత్వానికి సూచించారు. శనివారం ఆయన జగిత్యాలలో మీడియాతో మాట్లాడారు. సాగు చేసే రైతులకే రైతుబంధు పెట్టుబడి సాయం ఇవ్వాలని, గుట్టలకు, రియల్ ఎస్టేట్ భూములకు, బీడు భూములకు రైతుబంధు ఎందుకు ఇవ్వాలో చెప్పాలని ప్రశ్నించారు. సర్కార్ సొమ్ము అంటే అందరికీ అలుసేనని అన్నారు. అదానీ, అంబానీలకు కేంద్ర ప్రభుత్వం రూ.60 లక్షల కోట్ల రాయితీని ఇచ్చిందని మండిపడ్డారు.

## కాళేశ్వరం సబ్‌కాంట్రాక్ట్‌లపై దృష్టి

- వివరాల సేకరణలో జస్టిస్ ఘోష్
- రిటైర్డ్ ఇంజినీర్లతో ప్రత్యేక భేటీ
- ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టుపై ఆరా

హైదరాబాద్, జూన్15 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టులో సబ్ కాంట్రాక్ట్ వ్యవస్థపై విచారణ కమిషన్ చైర్మన్, జస్టిస్ ఘోష్ దృష్టి పెట్టినట్టు తెలిసింది. కాంట్రాక్ట్ ఏజెన్సీల అకౌంట్స్, స్టేట్‌మెంట్స్ పరిశీలించాలని, 'రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్' నుంచి డాటా తీసుకోవాలని యోచిస్తున్నట్టు కమిషన్‌వర్గాలు వెల్లడించాయి. 2015లో ఏర్పాటైన అనంత రాములు కమిటీలోని విశ్రాంత ఇంజినీర్లతో కమిషన్ కార్యాలయంలో జస్టిస్ ఘోష్ శనివారం సమావేశమయ్యారు. ప్రాజెక్టుపై ఇచ్చిన అప్పటి రిపోర్ట్‌ను జస్టిస్ ఘోష్‌కు రిటైర్డ్ ఇంజినీర్లు అందజేశారు. మేడిగడ్డను కేసీఆరే సూచించారని రిటైర్డ్ ఇంజినీర్లు వివరించినట్టు తెలిసింది. ఇప్పటివరకు వరకు ఇంజినీర్లు, నిర్మాణ ఏజెన్సీలను విచారించిన జస్టిస్ ఘోష్, అఫిడవిట్లు దాఖలు చేయాలని సూచించారు. వాటి పరిశీలన తర్వాత తిరిగి విచారణ ప్రారంభించాలని నిర్ణయించినట్టు సమాచారం. అవసరమైతే సీడబ్ల్యూసీ వాళ్లనూ విచారణకు పిలవాలని భావిస్తున్నట్టు తెలుస్తున్నది. ఏఈఈ, డీఈఈలను విచారించాలా? లేదా? అన్న దానిపైనా ఆలోచిస్తున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి.